క్లుప్తంగా

గాజువాక జెడ్సీకి ఉత్తమ ఏఈఆర్‌వో అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న జెడ్సీ సింహాచలం

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలానికి ఉత్తమ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్‌వో) అవార్డు అభించింది. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును కలెక్టర్ మల్లికార్జున, జిల్లా జడ్జి ఎస్.గోపి, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు తదితరుల చేతులమీదుగా అందుకున్నారు. అవార్డు స్వీకరించిన సందర్భంగా ఆయన్ను జీవీఎంసీకి చెందిన పలువురు ఉద్యోగులు, అధికారులు అభినందించారు.

దుర్గమాంబ, కుంచమాంబ అమ్మవార్ల పండగ నేడు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పరిసర ప్రాంతాల్లో జరిగే అతి పెద్ద ఉత్సవమైన దుర్గమాంబ, కుంచమాంబ అమ్మవార్ల పండగను 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. గ్రామంలో అమ్మవార్ల ఆలయ మైదానంలో విద్యుత్ దీపాలంకరణ మధ్య, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పండగను నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

కిక్ బాక్సింగ్ క్రీడాకారులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

గాజువాక: వచ్చే నెల 11 నుంచి 19 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు కిక్‌బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు ఆర్థికసాయం అందించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 70 మంది క్రీడాకారులు ఎంపిక కాగా, ప్రయాణ ఖర్చుల నిమిత్తం పలువురికి ఆర్థిక సాయం అందించినట్టు తెలిపారు. ప్రతిభ ఉండి ఆర్థిక స్థోమత లేని పేద క్రీడాకారులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు డాక్టర్ శేషు ప్రసాద్, శంకరరావు, కోచ్‌లు సన్నీ, ఆనంద్, వెంకీ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ పైనుంచి పడి బాలుడి మృతి

మల్కాపురం: స్కూల్ నుంచి వచ్చిన బాలుడు సరదాగా సైకిల్ తొక్కుతూ అదుపు తప్పి మృతి చెందాడు. దీంతో బాలుడి బంధువులు, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 59వ వార్డు ఎక్స్‌సర్వీస్ మెన్‌కాలనీలో కాశీ వికాష్(12) అనే బాలుడు తండ్రి గణేష్, తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. తండ్రి కోరమాండల్ బస్టాప్ వెనుక గల ప్రధాన మార్గంలో ఉమా జ్యూయలర్స్ (బంగారం షాపు) నడుపుతున్నాడు. జవహర్ నగర్‌లోని సరస్వతీ విద్యా విహార్ పాఠశాలలో వికాష్ 8వ తరగతి చదువుతున్నాడు. అయితే బుధవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వచ్చిన వికాష్ సైకిల్ తీశాడు. సాయిబాబా ఆలయానికి ఆనుకుని ఉన్న సర్వీసురోడ్డులో సైకిల్ తొక్కుతున్నాడు. ఆ మార్గం బాగా ఎత్తు (అప్)లో ఉండడంతో ఎత్తుకు సైకిల్ తీసుకు వెళ్లి, ఆ పల్లం (డౌన్) మార్గంలో సైకిల్‌పై అతి వేగంగా వచ్చాడు. దీంతో సైకిల్ అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ఘటనలో వికాష్ తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక సెయింట్ ఆన్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందినట్టు అక్కడ వైద్యు లు తెలపడంతో మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమో దు చేసి శవ పరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

ఓటు విలువ అమూల్యం

- ప్రజాస్వామ్య పరిరక్షణకు వజ్రాయుధం
- జోనల్ కమిషనర్ సింహాచలం
- జీవీఎంసీ ఉద్యోగులతో ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్సీ సింహాచలం, కార్పొరేటర్ ఇమ్రాన్ తదితరులు



కణితి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

గాజువాక: ఓటు సామాన్యుడి చేతిలో వజ్రాయుధమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎంతో కీలకమని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. ఓటు విలువ అమూల్యమన్నారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జోనల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, జీవీఎంసీ గాజువాక జోనల్ సూపరింటెండెంట్లు ఈశ్వరి, రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పేరం రామకృష్ణారెడ్డి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిజ్ఞ

కూర్మన్నపాలెం: కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని టి.ఝాన్సీరాణి ఎన్నికల ప్రాధాన్యాన్ని, ఓటర్ల బాధ్యతను వివరించారు. ఈ సందర్భంగా గతంలో పాఠశాల ఆవరణలో విద్యార్థి ఎన్నికల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్న విధానాన్ని గుర్తు చేసుకున్నారు.

విద్యార్థులతో నమూనా ఓటింగ్

అక్కిరెడ్డిపాలెం: ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు పాఠశాలల్లో ఓటు వేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నమూనా ఓటింగ్ నిర్వహించారు.ఆటోనగర్ వద్ద గల భాస్కర విద్యానికేతన్‌లో నమూనా పోలింగ్ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పి.భాస్కరరావు మాట్లాడుతూ ఓటు విలువ వెలకట్టలేనిదన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటర్లుగా నమోదు చేయించుకుని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కుతో సమర్థులను ఎన్నుకునే అధికారం

అగనంపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు పోస్టర్‌ను ప్రిన్సిపాల్ వి.సుశీల్ కుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సమర్థవంతమైన పాలనకు మంచివారిని ఎన్నుకునే అధికారం ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించిందన్నారు. పేరెంట్స్ కమిటీ సభ్యుడు బి. ప్రసాదరావు, ఏడీసీ డైరెక్టర్ బుదిరెడ్డి అప్పారావు, జిల్లా లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్ కె. హనుమంతరావు, సత్యనారాయణ, లెక్చరర్స్ పాల్గొన్నారు.



భాస్కర విద్యానికేతన్‌లో ఓటు వేసే ప్రక్రియను నిర్వహిస్తున్న విద్యార్థులు



ఓటర్ నమోదు పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

నవరత్నాలతో పేదల కళ్లలో వెలుగు

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: పేద వర్గాలకు సంక్షేమ పథకాలను చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కొనియాడారు. నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజల కళ్లల్లో వెలుగులు నింపారన్నారు. జీవీఎంసీ 65వ వార్డు బాపూజీ కాలనీ సచివాలయం పరిధిలోని సంజీవ కాలనీ, గిరిజా కాలనీ, భవానీనగర్ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీంతో ఈ వార్డు పరిధిలోని ఆరు సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసింది. కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులను కలిసి వారికి చేకూరిన లబ్ధిని వివరించారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనం తథ్యం

ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. జగనన్నపై నమ్మకంతో ప్రజలు గెలిపిస్తే, వారి ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు బురద జల్లుతున్నాయని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా.. వైఎస్సార్ సీపీ ప్రభంజనం తథ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు వాడపల్లి అప్పన్న, ప్రవీణ్, లోకనాథం, జుత్తు లక్ష్మి, ఎల్.వి. రమణ, పెంటి రాజు, సలపల స్వాతి, మద్దాల అప్పారావు, ఐరోతి గణేష్, మంగునాయుడు, దేముడు, సుందరరావు, రాంబాబు, నారాయణమూర్తి, మంత్రి మంజుల, పుష్ప, రమణ, అర్జున్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిగ్గు తేల్చేందుకే ఉక్కు ప్రజాగర్జన



713వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసినప్పటికీ, రాజ్యాంగ విలువలను మరిచి కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రజల డబ్బుతో పెత్తనం చెలాయిస్తున్న కేంద్ర ప్రభుత్వం నిగ్గు తేల్చే ప్రయత్నంలో భాగమే ఉక్కు ప్రజాగర్జన సభ అని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 713వ రోజు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ఎస్ఎంఎస్-2 విభాగం నుండి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడారు. కేంద్రంతో పాటు ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం కూడా ప్రైవేటీకరణలో భాగంగా కేంద్రానికి సహకరిస్తూ ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశపెట్టాలని, లేకుంటే తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 30వ తేదీన నిర్వహించే ఉక్కు ప్రజాగర్జన సభకు కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, ఆయోధ్యరామ్, గుమ్మడి నరేంద్ర ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా గర్జనకు తరలి రావాలి

ఎమ్మెల్యే నాగిరెడ్డి



బీసీ గేటు వద్ద నినాదాలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30న తృష్ణ మైదానంలో నిర్వహించనున్న ఉక్కు ప్రజా గర్జనకు అందరూ తరలిరావాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల నుంచి కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని సచివాలయాలకు నియమించనున్న కన్వీనర్ల వివరాలను వచ్చే నెల 1వ తేదీలోగా అందజేయాలన్నారు. సమావేశంలో మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, నాయకులు భూపతిరాజు శ్రీనివాసరాజు, రాజాన వెంకటరావు, మహేశ్వరరెడ్డి, కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, వెంపాడ అప్పారావు, ధర్మాల శ్రీను, బోగాది సన్నీ, గంధ్రెడ్డి రామునాయుడు, వెంకటేష్, ఈశ్వరరావు, మంత్రి శంకరనారాయణ, ఎన్నేటి రమణ, పిట్టా రెడ్డి, సిరట్ల వాసు, నక్క రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు గర్జనను విజయవంతం చేయాలి

పెదగంట్యాడ:ఉక్కునగరం తృష్ణ మైదానంలో నిర్వహించనున్న ప్రజాగర్జనను విజయవంతం చేయాలని అఖిల పక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బీసీ గేటు వద్ద బుధవారం ఉదయం జోరుగా ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులందరూ గర్జనకు హాజరు కావాలని కోరారు. కేంద్రప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాటాలకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పిట్టా రెడ్డి, జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, మార్టుపూడి పరదేశి, నందికి తాతారావు, బొడ్డు పైడిరాజు, జి.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగర్జనకు మద్దతుగా మానవహారం

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్న డిమాండ్‌తో ఈ నెల 30న తలపెట్టిన ప్రజాగర్జనకు వైఎస్సార్‌సీపీ నాయకులు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా పాతగాజువాక జంక్షన్‌లో బుధవారం మానవహారం నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకొనేవరకు పోరాటాలు సాగుతూనే ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, నాయకులు పాల్గొన్నారు.



మానవహారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

నేడు సరస్వతీ పూజలు

సామూహిక అక్షరాభ్యాసాలు

ఉక్కునగరం: వసంత పంచమిని పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిశక్తి దేవాలయం, హనుమాన్ దేవాలయాల్లో గురువారం సరస్వతీ పూజలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. సరస్వతీ దేవి జన్మ నక్షత్రం సందర్భంగా త్రిశక్తి దేవాలయంలో సరస్వతి దేవి అమ్మవారికి వేకువజామున 4 గంటలకు పంచామృతాభిషేకాలు చేయనున్నారు. అనంతరం ఉదయం 6.30 గంటలకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు మహాసరస్వతి మూల మంత్ర ప్రయుక్త అఖండ విద్యా హోమం, 6 గంటలకు సహస్ర నాగవల్లి పత్ర సహిత శ్వేత పుష్పార్చన చేయనున్నారు. ఆసక్తి గలవారు వేకువజామున హాజరు కావాలని ఆలయ ప్రధానార్చకులు ఫణి శర్మ కోరారు. హనుమాన్ దేవాలయంలో ఉదయం సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 11 గంటలకు పుష్పాంజలి పూజ, 11.30 గంటలకు అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 7 గంటలకు మహా హారతి అనంతరం సమారాధన, భజనలు చేయనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ప్రజా గర్జనకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 30న నిర్వహించనున్న ప్రజా గర్జనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కావాలని జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ పంపారు. కేంద్ర ప్రభుత్వం రెండేళ్లుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై దూకుడుగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతుందన్నారు. కార్మిక వర్గం అప్పటి నుంచి ఆందోళనలు కొనసాగిస్తున్నదన్నారు. అయినప్పటికి కేంద్ర వైఖరిలో మార్పు రాలేదన్నారు. రాజకీయ పార్టీల ద్వారా ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు ఈనెల 30 నిర్వహించనున్న ప్రజా గర్జనకు అన్ని పార్టీలను ఆహ్వానించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా తమరు కూడా హాజరు కావాలని ఆశిస్తున్నట్టు లేఖలో పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వాన్ని తాకేలా ఉక్కు ఉద్యమం

- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్య పోరాటం
- 27న గాజువాకలో ర్యాలీ, బహిరంగ సభ
- అఖిలపక్ష సమావేశంలో నాయకుల పిలుపు



సమావేశంలో నాయకుల అభివాదం

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని తాకేలా ఉద్యమం చేపడతామని అఖిలపక్ష రాజకీయ, కార్మిక, వ్యాపార సంఘాల నాయకులు తెలిపారు. ఐక్యపోరాటాలతో ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుంటామని స్పష్టం చేశారు. ఈ నెల 30న ఉక్కునగరం తృష్ణ మైదానంలో చేపట్టనున్న ప్రజాగర్జన కార్యక్రమం ద్వారా అన్ని రాజకీయపక్షాలను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. గాజువాకలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పలువురు ప్రసంగించారు.

ఏకపక్ష నిర్ణయాలతో ప్లాంట్ నిర్వీర్యం

ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఈ ప్రాంతం ఎడారిగా మారుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని నిర్ణయించిందని, దీనికోసం ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తోందని పేర్కొన్నారు.

అందరికీ ఆహ్వానం

మరో చైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజాగర్జనకు మద్దతుగా ఈనెల 27న గాజువాకలో భారీ ర్యాలీ, బహిరంగ సభను నిర్వహించనున్నామని తెలిపారు. 30న తలపెట్టిన ప్రజాగర్జనకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులను ఆహ్వానించామన్నారు.

సంపూర్ణ మద్దతు

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ ఉక్కు ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతును ఇప్పటికే తెలిపామని, ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, జనసేన నాయకుడు తిప్పల రమణారెడ్డి, ఉక్కు నిర్వాసిత సంఘం అధ్యక్షుడు పులి రమణారెడ్డి, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు డీఈవీ అప్పారావు, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, వై.మస్తానప్ప, రాంబాబు, అచ్చిబాబు, బొడ్డు పైడిరాజు, వరసాల శ్రీనివాసరావు, చిత్రాడ సన్యాసిరావు, కసిరెడ్డి సత్యనారాయణ, గణపతిరెడ్డి, నమ్మి సింహాద్రి, విళ్లా రామ్మోహనకుమార్, పంచదార్ల ఉగ్రం తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు

ఉక్కునగరం: గత నెల 20న స్టీల్‌ప్లాంట్ డీపాల్ పాఠశాల కూడలి వద్ద జరిగిన ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన సంఘటనపై ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వారికి నోటీసులు జారీ చేశారు. వివరాలివి.. ఆ ప్రమాదం జరిగిన రోజు పాఠశాలకు చెందిన విద్యార్థుల పేరెంట్స్, కొంతమంది నాయకులు రహదారిపై బైఠాయించిన సంగతి తెలిసిందే. ఆ రోజు రెండు బస్సుల అద్దాల ధ్వంసం అయ్యాయి. ఆ సంఘటనపై ఇప్పుడు కేసులు నమోదు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై స్టీల్ ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావును వివరణ కోరగా సంఘటన జరిగిన రోజునే కేసులు నమోదు చేశామని, దానికి సంబంధించి ఇప్పుడు నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత ప్రచారం



పాతగాజువాక జంక్షన్‌లో ప్రమాద దృశ్యాలను వీక్షిస్తున్న ప్రజలు

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు ప్రమాదాల నివారణకు సిటీ పోలీసులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీనిలో భాగంగా ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు దృశ్య శ్రవణ పరికరాలను ఉపయోగిస్తున్నారు. బుధవారం గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి పాతగాజువాక జంక్షన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ ఆర్.సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. గతంలో సీసీ కెమెరాలో రికార్డయిన రోడ్డు ప్రమాద ఘటనలను ప్రదర్శించారు. వాహనదారులు చేసిన తప్పిదాలు, ప్రమాదాలను ఏ విధంగా అధిగమించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు.

పోలీసుల చొరవతో బ్యాగ్ రికవరీ



పోలీసులు స్వాధీనం చేసుకున్న బ్యాగ్‌ను బాధితులకు అందజేస్తున్న క్రైం సీఐ సూర్యనారాయణ, సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: నగలతో ఉన్న బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయిన బాధితులు గాజువాక క్రైం పోలీసులను ఆశ్రయించారు. దీంతో అలర్ట్ అయిన గాజువాక క్రైం పోలీసులు ఆటోను గుర్తించి ఆటో డ్రైవర్ నుంచి బ్యాగును స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. గాజువాక క్రైం సీఐ పి.సూర్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ నడుపూరి గ్రామానికి చెందిన కంబాల శ్రావణి షీలానగర్‌లో తన బంధువుల ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం ఒక ఆలయానికి రావటానికి షీలానగర్ వద్ద ఆటో ఎక్కి నాతయ్యపాలెం వద్ద దిగింది. ఈ సమయంలో ఆటోలో ఆమె నగలతో కూడిన బ్యాగ్ మర్చిపోయింది. తరువాత చూసుకున్న ఆమె వెంటనే గాజువాక క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే క్రైం పోలీసులు షీలానగర్ నుంచి నాతయ్యపాలెం మధ్యలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి ఆటో అనకాపల్లి జిల్లాదిగా గుర్తించారు. వెంటనే ఆటో డ్రైవర్ సమాచారాన్ని సేకరించి ఆటో నుంచి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. బ్యాగులో 3 తులాల బంగారం, 4 తులాల వెండితో పాటు సెల్ ఫోను, ఛార్జర్ ఉన్నాయని బాధితురాలు పోలీసులకు తెలిపారు. తాళంతో ఉన్న బ్యాగును బాధితులకు బుధవారం క్రైం సీఐ పి.సూర్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. క్రైం ఎస్ఐ మహేశ్వరరావు, సిబ్బంది జయేంద్ర, ఘాటిలను సీఐ అభినందించారు.

బాడీబిల్డర్‌కు స్పీకర్ అభినందన



బాడీబిల్డర్లను అభినందిస్తున్న స్పీకర్ తమ్మినేని

పెదగంట్యాడ: బాడీ బిల్డింగ్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించి, దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గతేడాది జులై 15న జరిగిన ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్‌తో పాటు గత డిసెంబర్ 12న థాయిలాండ్‌లో జరిగిన బాడీబిల్డింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన నమ్మి మారునాయుడును బుధవారం అభినందించారు. ఆర్మీలో ఉద్యోగం చేస్తూ, క్రీడా రంగంలో రాణిస్తూ పతకాలు సాధిస్తున్న మారునాయుడు భవిష్యత్తులో మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీమిండియా కోచ్ తాడి శివశంకర్, ది ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.